అసహ్యించుకున్న
ఆమెకే
చేతులెత్తి
దణ్ణం పెట్టాలని
ఎందుకనిపించింది ?

# అమ్మ

సలీం కథ

సౌరాజ్యం ఆకాశానికేసి చూసింది.

ఆవురావురుమంటూ ఆకాశాన్నంతా తినేసి, ఆకలి తీరక కామోసు మేఘాలు నీలి ముక్క కోసం ఆరాటంగా వెదుక్కుంటున్నాయి.

సౌరాజ్యం కళ్లలో భయం.

"ఓలమ్మో ఎన్ని మబ్బులో" గుడిసెలోకి పరుగెత్తింది.

చీకటి — పొద్దు పొడిచింది గంట క్రితమే అయినా గుడిసె నిండా దట్టంగా అల్లుకుంటూ చీకటి.

సౌరాజ్యం గుండెనిండా భయం గొలిపే చీకటి.

ఆ గుడిసెలో ఓ మూల పాత గుడ్డల మూటలా పడి వున్నాడు కొండడు.

రెండేళ్ల క్రితం ఓ చిన్న గుడిశె — చిరిగిన కొన్ని పాత బట్టలు, ఎప్పటిదో పగిలిన రేకుడబ్బాలాంటి పెట్టె, అందులో కాబోయే భార్యకోసం అపురూపంగా దాచుకున్న పూసల నగలు, అక్కడక్కడా పడివుండే సత్తుగిన్నెలు — వీటితో విరాజిల్లే తన అతిచిన్న సామ్రాజ్యానికి సౌరాజ్జెన్ని రాణిని చేశాడు.

ఆల్చిప్పల్లా విశాలంగా వుండే కళ్లు — పట్టుకుంటే జారిపోయేలా వుండే మన్నటి నిగారింపైన ఒళ్లు — హాయిగా అవ్పించే అందమైన నవ్వు రూపుదిద్దుకున్న మేఘకన్యలా వుండే సౌరాజ్యం మత్తులో కొండడికి వూపిరాడకుండా పోయింది.

సౌరాజ్యం రాచరికంలో ఆకలికి అవకాశమే లేదు. కొండడు పగలంతా రిక్షా తొక్కుతాడు. తొమ్మిది కాకముందే గుడిసె



ముందు వాలిపోతాడు.

ఆ తెచ్చిన డబ్బు చాలా జాగ్రత్తగా వాడుతుంది సారాజ్జెం. అందులోనే అన్నిరకాల రుచులూ — అన్ని రకాల సరదాలు తీర్చుకుంటుంది.

సారాజ్జెనికి కొండడిదే లోకం — కొండడికి సారాజ్జెమే లోకం.

ఆ లోకంలోకి బుల్లికొండడు ప్రవేశించా

డు.

"చూడు మావా... నీ ముక్కే బండ ముక్కు" అంటూ పగలబడి నవ్వుతుంది సారాజ్జెం.

"కళ్లు నీవేనే... అరచేయంత" మురిపెంగా చూస్తాడు సారాజ్జెంవైపు.

అటువంటి కొండడికి ఐదురోజుల్నించీ జ్వరం.

సారాజ్జేనికి కళ్లనిండా నీళ్లు పొంగుకొచ్చాయి. ఎన్నడూ కాళ్లు నొప్పులవైనా చెప్పని కొండడు — కండలు తిరిగి బలిష్ఠంగా — ఆరోగ్యంగా వుండే కొండడు — ఇప్పుడు నిప్పుపోయంగా — తోటకూర కాడలా — వడలిపోయి వున్నాడు.

మొదట మామూలు జ్వరమేననుకుని కషాయం తీసిచ్చింది. రెండో రోజు వళ్లు జ్వరంతో పేలిపోతుంటే భయమేసి గవర్నమెంట్ వారి ఆస్పత్రికి పిల్చుకెళ్లింది.

మూడు గంటలు నిలబడ్డాక కొండడు శోష వచ్చి పడిపోయే స్థితికి చేరుకున్నాక ఓ అరగంట తిట్టి — గొంతులో ఇన్ని రంగునీళ్లు పోసి రెండు మాత్రం పొట్లం కట్టి ఇచ్చారు.

"రేపటికి మాత్తర్లు బాబూ" అంటే —

"రేపు మళ్ళా రా పో — వారానికి సరిపడా ముదుపు కట్టి ఇస్తారనుకున్నావా" అని కసిరేసుకున్నారు.

జ్వరం ఏమాత్రం తగ్గుముఖం పట్టకపోతే ఆ మురికివాడలకు దగ్గరగా వాళ్ల రక్తమాంసాల్తో బలిసి బతుకుతున్న ఓ ప్రైవేట్ డగ్గర్ దగ్గరకు పిల్చుకెళ్లింది. తను అతి పొదుపుగా వుండి దాచుకున్న అర్ధరూపాయి బిళ్లలు, రూపాయి బిళ్లలు పాతబడి నలిగిపోయిన ఒకటి రెండు రూపాయల నోట్లు వూడ్చుకుపోయినట్లు అయిపోయాయి.

రాజ్జేనికి దిగులుగా వుంది.

ఈరోజుకి కొండడు ఎంగిలి పడి ఐదురోజులు. మొదట్లో కొద్దిగా జావైనా కాసిచ్చేది.

ఇప్పుడు ఇంట్లో చిల్లిగవ్వ లేదు.

కొండడు తెచ్చే డబ్బు ఏ రోజుకారోజు సరిపోవడమే అంతంత మాత్రం. తను దాచుకున్న డబ్బంతా డాక్టర్ తిమింగలం మింగేసింది. చంటివాడు ఏడుస్తున్నాడు. గుక్కపట్టి. ఆకలి.

సారాజ్జేనికి అప్పుడు ఆకలి గుర్తొచ్చింది. పొయ్యి రాజేసి అప్పటికే వంటై ఎనిమిది గంటలు దాటింది.

రెండ్రోజులు కొండడిని చూసుకోవడంలో ఆకలే గుర్తుకు రాలేదు.

కొడుకు పైకప్పు ఎగిరిపోయేలా గుక్కపట్టి ఏడుస్తున్నాడు.

ఐదు నెలలైనా నిండలేదు వాడికి.

వెళ్లి ఒక్కసారిగా చాపమీద వాడి ప్రక్కనవాలిపోయింది.

వాడిని కౌగిలించుకుని భోరుమని ఏడ్చేసింది.

నోటికి రొమ్ము అందించింది. కొద్దిసేపటికి ఏడుపు ఆపాడు. తన ప్రాణాల్ని తోడేస్తున్నట్లు చీకుతున్నాడు.

పెద్దగా ఉరుము ఉరిమింది. తళుక్కుమని వెలుగు.

చల్లటి గాలి గుడిసెలోకి దూరి తన

శాడిస్టిక్ ఆనందాన్ని అనుభవిస్తోంది.

సారాజ్జెం కొడుకువైపు చూసింది. వాడు నిద్రపోతున్నాడు. కంటి పక్కగా చారలుకట్టిన కన్నీళ్లు. పెదవుల కొసలనుంచి చొంగతోపాటు కారుతున్న ఓ పాలచుక్క.

లేచి కొండడి దగ్గరగా వచ్చింది.

కొండడు వణుకుతున్నాడు గజగజ...

సారాజ్జెం తన పాతచీరలన్నీ తెచ్చి కొండడిని కప్పింది.

ఈరోజైనా కొండడికి కొద్దిగా జావకాసిద్దామన్న కోరిక సారాజ్జెంలో...

తడిక దగ్గరగా వేసి ఆ చుట్టుపక్కల అన్ని గుడిసెలకూ వెళ్లి అర్థించింది. రెండ్రూపాయలుంటే అప్పుగా ఇవ్వమని. ఎవరిస్తారు? అందరూ కూలినాలి చేసుకుని బతికేవాళ్లే... చాలామంది గుడిసెల్లో ఆకలి ప్రస్ఫుటంగా కనిపించింది సారాజ్జెనికి.

నిరాశగా నీరసంగా కాళ్లీడ్చుకుంటూ వస్తున్న సారాజ్జెన్ని పలకరించింది నాగమణి.

ఉలిక్కిపడి తలయెత్తింది సారాజ్జెం.

గడపమీద కూచుని వుంది నాగమణి. శవం నవ్వినట్లు జీవంలేని నవ్వు పెదవులమీద.

అసహ్యంగా మొహం తిప్పుకుని నడక వేగం పెంచింది సారాజ్జెం.

తనకు కొండడు చెప్పేదాకా తెలియదు నాగమణి వ్యభిచారి అని. ఆ గుడిసెలో, చుట్టుపక్కల వున్న మరో రెండు గుడిసెల్లో జరిగేది అదే వ్యాపారం అని.

తనెంత అమాయకురాలు! మొదట్లో నాగమణి నవ్వుతూ పలకరిస్తే తనూ పలకరించేది.

నాగమణికి పాతికేళ్లుంటాయి. ఎటొచ్చి పెళ్లి చేసుకోలేదు. గుడిసెలో ఒక్కతే వుంటుంది.

ఇంతే తెల్సిన సారాజ్జెం నాగమణితో కలుపుగోలుగా మాట్లాడేది. రెండుమూడుసార్లు నాగమణి తన ఇంటికి కూడా వచ్చింది.

కొండడికావిషయం తెల్సి మండిపడ్డాడు.

“సంపేత్తాను దాంతో మాటాడితే — అదేంటనుకున్నావ్ ఎదవారి — ఎర్రిమొగమా, సంసారుల్లో

## తొలిసారి



ఆర్కిమిడీస్ అర్థాన్ని ఎప్పుడు చూశాడో తెలుసా? తన 75వ ఏట! క్యాటో తన 80 ఏట గ్రీకుభాషను నేర్చుకున్నాడు. సోఫోక్లిజ్ ‘ఈడిపక్స్ రెక్స్’ అనే నాటకాన్ని తన 70వ ఏట వ్రాశాడు. గెటె తన ‘ఫౌస్ట్’ రెండో భాగాన్ని 83వ ఏట వ్రాసి ముగించాడు. కొన్రాడ్ అడెనార్ తన 73వ ఏట జర్మన్ ఫెడరల్ రిపబ్లిక్ ఛాన్సలరై 87 సం. వచ్చేదాకా పదవి నిర్వహించాడు.

— అచ్యుతుని రాజ్యశ్రీ

దూరిందంటే కొంపలార్పిపోద్ది"

అప్పటినుండీ నాగమణి పల్కరించినా తను ముఖం తిప్పేసుకుని వచ్చేసేది.

ఎంతటి అసహ్యమైన స్త్రీ! ఏ కూలోనా లో చేసుకుని బ్రతకవచ్చుకదా... ఇంత నీచమైన కూడు తినకపోతేనేం. ఛీ. అంతకన్నా ఆకలితో చావడమే ఉత్తమమం.

ఆలోచించుకుంటూ నడుస్తున్న సారాజ్జెనికి తన మావకు రిక్షా అద్దెకిచ్చే రిక్షా ఓనర్ గుర్తొచ్చాడు.

నల్లగా పొట్టిగా బానపొట్టతో వుంటాడు. దట్టగా పెంచిన మీసాలు పైకి మెలేసి గ్లాస్కో లాల్చీ తొడుక్కుని సిగరెట్ కాలుస్తూ...

"ఒరేయ్ దొంగనా కొడకా... రిచ్చా ఇలా సేసి తెచ్చావేంరా" అనో, "నిన్నటి అద్దె డబ్బేదిరా — నీ బాబుగాడి ముల్లె వుందనుకున్నావా — అద్దిచ్చి బండట్టుకుపో'' అనో తిడ్తూ వుంటాడు.

సారాజ్జెంలో ఆశ — ఇలాంటి పరిస్థితిని వివరిస్తే కరగని మనుషులుకూడా వుంటారా — సారాజ్జెనికి ధైర్యం వచ్చింది.

వర్షం ప్రారంభమైంది. గుడిసెలోంచి వర్షం చాలాచోట్ల దారగా కారుతోంది.

కొండడిని పసివాడిని పొడిగా వుండే మూలకి జరిపింది. చిరుగులు పడిన పాత గోనెపంచి దులిపి దాన్ని నెత్తిమీద వేసుకుంది

ఓ రెండు ఫర్లాంగులు నడిస్తే చాలు — రిక్షా ఓనర్ మల్లయ్య ఇల్లు వస్తుంది.

కొంత దూరం వడివడిగా నడిచిన సారాజ్జెం — అప్పటికే ముద్దగా తడిసిపోయింది. వర్షం అవిశ్రాంతంగా — కసిగా —కోపంగా కురుస్తోంది. చలి వెన్నుల్లోంచి తన్నుకొస్తోంది. ఇక ఆగలేక సారాజ్జెం పరుగెత్తడం ప్రారంభించింది.

ఎదురుగా ఏముందోకన్పించనంత విపరీతమైన వర్షం.

సంధించిన బాణంలా పరుగెత్తుతోంది సారాజ్జెం. కసిగా నేలని బాదుతూ నీళ్లని చేదిస్తూ....

మల్లయ్య ఇంటిని చేరుకున్నాకే ఆగింది.

తలుపు మెల్లగా తట్టింది. "అయ్యా అయ్యా" అంటూ దైన్యం నిండిన గొంతుతో పిల్చింది. ఎక్కడో నూతిలోంచి వస్తున్నట్లు స్వరం.

"బాబూగోరూ" ఈసారి కొద్దిగా గట్టిగా తలుపుల్ని బాదింది.

"ఎవరూ" అనే స్వరంతోపాటు తలుపు తెరుచుకుంది.

ఎదురుగా మల్లయ్య.

"ఎవరూ" మళ్లీ అడిగాడు గడప దగ్గర నిలబడ్డ సారాజ్జెన్ని ఎగాదిగా చూసి —

"నేనయ్యా కొండడి పెళ్లాన్ని" గొంతులో కొద్దిగా వణుకు.

"ఏటయిందే కొండడికి — రిచ్చాకోసం రాకపోతే ఏటో అయిందనే అనుకున్నా"

మల్లయ్య గొంతులో ధ్వనించిన ఆదుర్దా ముత్యపు జల్లులావుంది.

"జొరం బాబు... మాయదారి జొరం. ఆడ్ని పీల్చి పిప్పిసేసేసింది. ఇంట్లో పైసా కూడా లేదు. రెండ్రోజులుగా ఆడికేమీ పెట్నేదు. మీరు దరమ పెబువులు.

అందుకే లగెత్తుకొచ్చినా. ఓ రెండ్రూపాయలు అరువివ్వండి సామీ — ఇన్ని నూకలైచ్చి ఆడికి గంజి కాపిస్తా'' ఆశగా చూసింది మల్లయ్యవైపు.

హమ్మయ్య సీరియస్ కేసుకాదు. ఆకలి కేస్. ఓస్ అనుకున్నాడు మల్లయ్య అప్రయత్నంగా మీసం మెలేస్తూ.

''నావాల్లు ఆపదలో వుంటే అరువేమిటి ? ఆ మాత్తరం సాయం సేయకపోతే మనిషి మాత్తరం దేనికి — రా లోపలికి'' అన్నాడు.

సారాజ్జెం లోపలికెల్లింది. మల్లయ్య సారాజ్జెంవైపు చూశాడు.

తడిసిన చీరలోంచి శరీరం నగ్నంగా కన్పిస్తున్నట్లు రొమ్ములు కళ్లలో పొడుస్తున్నట్లు—

మల్లయ్య కళ్లల్లో ఎర్ర జీరలు.

''పదిరూపాయలు సాలా'' అన్నాడు ఆకలిగా చూస్తూ...

''అంత తీర్చలేం బాబూ. రెండు సాలు'' కళ్లనిండి కృతజ్ఞత నింపుకుని అంది సారాజ్జెం.

''తీర్చక్కరలా వుంచుకో''

పదిరూపాయలనోటు సారాజ్జెం చేతిలో పెట్టి గుప్పెటమూసి బలంగా తనవైపుకు లాక్కున్నాడు.

బైట ఎక్కడో ఉరిమింది భయంకరంగా.

సారాజ్జెం గుప్పిటలో పదిరూపాయలు నలుగుతోంది. మల్లయ్య చేతిలో సారాజ్జెం గుప్పిట నలుగుతోంది.


అసహ్యం. భయం తిరస్కారంతోపాటు సారాజ్జెకి నీరసం వచ్చేస్తోంది.

సారాజ్జెం రొమ్ము నలుగుతోంది కర్కశంగా. సారాజ్జెం మనసు నలుగుతోంది.

ఒక్కసారిగా తల విదిల్చి పెదవులకోసం వెదుక్కుంటున్న మల్లయ్య ముఖంమీద కుమ్మింది. మల్లయ్య బాధగా అరిచాడు.

పెదవి చిట్లి రక్తం కారుతోంది. మోకాలు మడిచి కడుపులో ఫెడీమని తన్నింది. మెలికలు తిరుగుతున్నాడు మల్లయ్య.

నలిగిన పదిరూపాయల నోటు విసిరికొట్టింది.



'థూ' అని వూసింది.

ఆ వర్షంలో ఈసారి సారాజ్జెం పరుగెత్తడంలేదు. ఆశలేదు. కోరికలేదు. బాధలేదు. విరాగిలా నడుస్తూ గుడిసె చేరుకుంది. అప్పటికి పొద్దుగూకేసింది.

• • •

ఉదయం సారాజ్జెంతోపాటు ఆకలికూడా నిద్రలేచింది.

మొదట కొండడి వళ్ళు తాకిచూసింది. చల్లగా వుంది.

హమ్మయ్య అనుకుంది. తన కొండడికి జ్వరం తగ్గిపోయింది.

"ఎలా వుంది మావా" అని అడిగింది.

"ఆకలిగా వుందే" అన్నాడు కొండడు. ఆకలి ఆకలి ఆకలి.

సారాజ్జెం సంబరాన్ని క్షణంలో ఆకలి తినేసింది.

బైట వర్షం ఆగకుండా కురుస్తోంది.

ఇంకెవర్ని అడగాలి? చుట్టుపక్కల అందర్నీ అడిగింది. అయినా ఈ వర్షంలో ఎవరికైనా ఏం పని దొరుకుతుంది?

సారాజ్జేనికి వాగమణి గుర్తొచ్చింది. తను అసహ్యంచుకుని తప్పించుకు తిరిగినా, నవ్వుతూ పలకరించే వాగమణి.

ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని వాగమణి దగ్గరకెళుతుంది?

మొహం చెల్లలేదు సారాజ్జేనికి.

బాబునెత్తుకుని కొండడి తలదగ్గర కూచుండిపోయిందని.

మధ్యాహ్నం దాటిపోయింది. అరగంటకోసారి కొండడు ఆకలంటూ అడుగుతుంటే గుండె తరుక్కుపోతుంది.

బాబుని కొండడి పక్కన పడుకోబెట్టి ఓ నిశ్చయానికొచ్చి లేచింది.

కొండడికి తెలిస్తే చంపేస్తాడని తెల్సు

కొండడి ఆకలి తీరాక తనని చంపినా పర్లేదు.

వాగమణి ఇంటికి వర్షంలో తడుస్తూ పరుగెత్తింది.

స్నేహంగా ఆహ్వానించింది వాగమణి. ప్రేమగా మాట్లాడింది.

"ఈ వర్షంలో తలుపుతడితే ఎవుడో పాసింజరనుకున్నా" కళ్లలో నిరాశ తళుక్కున మెరిసి మాయమైంది.

సారాజ్జెం అంతా చెప్పింది.

"ఇన్ని మాకలుంటే ఇయ్యకా. అడికైనా ఆకలి తీరుద్ది" ప్రాధేయపడుతున్నట్లు అడిగింది.

వాగమణి పేలవంగా నవ్వింది.

"ఈ వర్షంలో గిరాకీలేమొస్తాయి? రెండ్రోజుల్నుంచి ఒక్క పన్నాపీ రాలేదు. లేనింత వండుకుని తిని రెండ్రోజులు దాటింది" చాలా జాలిగా చూపింది వాగమణి. అపుడు గమనించింది సారాజ్జెం

వాగమణి మొహంలోనీరసం. కళ్లల్లో ఆకలి, మనసులో ఆవేదన.

సారాజ్జెం కళ్లల్లో నీళ్లు.

"ఇంతమాత్రానికే ఏడ్వాలా — నీవు నన్ను మనసారా అక్కా అని పిలిచావు. నీకోసం ఏమీ చేయలేని అసమర్ధురాల్ని కాదు. ఇక్కడే కూచుని వుండు. ఓ పది నిమిషాల్లో వచ్చేస్తాను" అంటూ వాగమణి ఆ వర్షంలోనే బైటికి పరుగెత్తింది.

సారాజ్జేనికి అర్ధంకాలేదు. వాగమణి ఏం చేయాలనుకుంటుంది. గుడిసె తలుపుకానుకుని వర్షంలోకి చూసింది. మసక మసగ్గా వాగమణి కన్పించింది. ఓ గుడిసెలోపలికి పోతూ. అదెవరి గుడిసో అర్ధమైన సారాజ్జెం అవాక్కయిపోయింది.

ఆ గుడిసె నారిగాడిది. వాణ్ణి రోజూ తను చూస్తూనే వుంటుంది. ఉదయాన్నే ఓ పదేళ్ల అబ్బాయి వచ్చి వాణ్ణి చక్రాల బల్లమీద కూచోబెట్టుకుని అడుక్కోడానికి లాక్కెళుతుంటాడు. చక్రాల బల్ల లాగినందుకు వాడికి రోజుకు రూపాయి ఇస్తాడు నారిగాడు. నారిగాడి రెండు కాళ్లు తొడలదాకా తెగిపోయాయి ఏదో ప్రమాదంలో. దానికి తోడు వాడికి కుష్ఠువ్యాధి. విరిగిపోయిన ముక్కు, సగందాకా తెగిపడిపోయిన వేళ్లతో అసహ్యంగా వుంటాడు. వాడిచుట్టూ ఎప్పుడూ ఈగలు ముసురుకుంటుంటాయి. మొండిచేత్తోనే వాటిని తోలుకుంటూ వుంటాడు. వాడి దగ్గర భరించరానంత దుర్గంధం వస్తూ వుంటుంది. వాడు వస్తున్నాడంటేనే అందరూ అసహ్యంతో పక్కకు తప్పుకుని పోతారు.

అలాంటి నారిగాడి గుడిసెలోకి నాగమణి వెళ్లింది.

స్తబ్ధంగా నిలబడిపోయిన సారాజ్జెం నాగమణి రాకను గమనించనే లేదు.

నాగమణి కళ్లు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. అదో రకమైన తృప్తితో మొహం వెలిగిపోతోంది.

"నాకు తెల్సు — వాడు కాదనడని — కానీ చూశావా. నీవెంత అడిగినా ఇస్తానని నా వెంట బడినప్పుడు వాణ్ణి ఛీకొట్టాను. ఈ రోజు అవసరం నాది కదా. వాడు నా మొహంమీద వెంద్రూపాయలు కొట్టాడు. పోన్లే ఈ డబ్బు నీ అవసరాలకు ఉపయోగపడితే నాకంతే చాలు" అంటూ. నాగమణి సారాజ్జెం చేతిలో రూపాయి నాణేలు రెండు పెట్టింది.

సారాజ్జెం చేతులు వణుకుతున్నాయి.

"నాకోసం నారిగాడిదగ్గర పొయ్యా. ఎందుకలా చేశావు. మనసుని చంపుకుని" సారాజ్జెం బావురుమంది.

"మనసుని చంపుకుని పోలేదు. మనసారా వెళ్లాను. ఏ తృప్తీలేని నా జీవితంలో కనీసం ఈ తృప్తి అయినా మిగలనీ. తొందరగా వెళ్లి నూకలు కొని కొండడికి జావకాసి పెట్టు" కన్నీళ్లు తుడిచి చెప్పింది నాగమణి.

కడుపుకింత కూడు వండిపెట్టగలిగేదే తల్లి. తన కొండడి కోసం తను ఏమీ చేయలేకపోయింది. ఈ రోజు తన కొండడికి కూడు పెడ్తున్నది తను కాదు. నాగమణి. ఎవరయినయితే తన కొండడు 'కొంపలార్పుద్ది' అని ఈసడించుకున్నాడో — ఎవరినయితే తను ఇన్నాళ్లూ వ్యభిచారి అని అసహ్యించుకుందో ఆమె ఈనాడు తల్లిలా తను కరిగిపోయినా కూసింత వెలుగునివ్వాలని తాపత్రయపడే కొవ్వొత్తిలా — పిల్లల ఆకలి తీర్చడంకోసం ఏమైనా చేయగల దయగల అమ్మలా —

ఇప్పుడు సారాజ్జెం అక్కడి ఆకాశంలా వుంది. భోరుమని రోధిస్తూ ధారగా కన్నీరు కారుస్తూ —

అప్రయత్నంగా రెండు చేతులూ జోడించి నాగమణికి నమస్కరించింది.

ఆకలి చల్లార్చే మహా ఫలవృక్షంలా, దాహం తీర్చే అనంత జలాశయంలా నాగమణి.

కమ్మని ప్రేమనందించే అమ్మలా — కోరిన కోరికలు తీర్చే గుడిలోని అమ్మోరిలా నాగమణి.

ఆమె వ్యభిచారి అయితేనేం — మనసున్న మనిషి.

మహోధృత కడలితరంగంలా పొర్లుకొస్తున్న కన్నీళ్లను, ధారలుగా కురుస్తోన్న వర్షాన్ని పట్టించుకోకుండా తన గుడిసెవైపుకు పరుగెత్తుతూ అనుకుంది సారాజ్జెం — ఇంకా మానవత్వం మనుషుల్లో చావలేదు — ఎక్కడో ఏ పతిత గుండెల్లోనో మలిన పడకుండా బ్రతికే వుంది.

* * *